రహదారికి మోక్షం



సూర్యతేజానగర్, పార్వతీనగర్ మధ్య గెడ్డ వద్ద జరుగుతున్న విస్తరణ పనులు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గం ఆరిలోవ ప్రాంతంలో రోడ్లకు మోక్షం కలుగుతోంది. ట్రాఫిక్ సమస్య ఉన్న ప్రాంతాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల సూచనల మేరకు జీవీఎంసీ అధికారులు రోడ్ల విస్తరణకు చర్యలు చేపట్టారు. బీఆర్‌టీఎస్‌పై చినగదిలి నుంచి సూర్యతేజానగర్ మీదుగా అంబేడ్కర్‌కూడలి వరకు, బాలాజీనగర్ నుంచి తోటగరువు వరకు, అంబేడ్కర్ కూడలి నుంచి టీఐసీ పాయింట్, దుర్గాబజార్ మీదుగా ఆరిలోవ కాలనీ ఆఖరి బస్ స్టాప్ వరకు రోడ్ల విస్తరణ చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఇటీవల చినగదిలి కూడలి నుంచి సూర్యతేజానగర్ వరకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ 2.35 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు నుంచి అటు అంబేడ్కర్ కూడలి, ఇటు శ్రీకాంత్‌నగర్ వెళ్లే రహదారులను కలుపుతూ కనెక్టివిటీగా గెడ్డపై బ్రిడ్జి విస్తరణ పనులు చేపట్టారు. ఈ బ్రిడ్జి విస్తరణ పనుల కోసం జీవీఎంసీ రూ.2.75 కోట్లు మంజూరు చేసింది. కొద్ది రోజులగా అధికారులు పనులు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు ఇదే ప్రాంతంలో సుమారు పదేళ్లగా రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆరు నివాసాలను జీవీఎంసీ అధికారులు ఇటీవల తొలగించారు. వీరికి నష్టపరిహారం అందించారు. పదేళ్లుగా పరిష్కారం కాని ఇక్కడ సమస్య ఇప్పుడు క్లియరైంది. దీంతో అటు అంబేడ్కర్ కూడలికి, ఇటు శ్రీకాంత్‌నగర్ వైపు మీదుగా ఆరిలోవ చేరుకోవడానికి ఉన్న రోడ్డును విస్తరించనున్నారు.

ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం

ఇక్కడ ఇరుకు బ్రిడ్జి, రహదారికి మధ్యలో నివాసాలు సుమారు పదేళ్ల నుంచి సమస్యగా మిగిలాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ రెండు సమస్యలను పరిష్కరిస్తామంటూ హామీలు ఇచ్చి గాలికి వదిలేసింది. ఎమ్మెల్యే ఈ సమస్యలపై మాటలతోనే కాలంగడిపేశారు. దీంతో ఆరిలోవ ప్రజలు విసిగిపోయి ఎమ్మెల్యే వెలగపూడిపై అసంతృప్తితో ఉన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో పాటు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి స్థానికురాలు కావడంతో ఈ సమస్యలకు పరిష్కారం లభించింది. ఆమె కృషితో ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం, రోడ్ల విస్తరణ జరుగుతున్నాయి. దీంతో ఆరిలోవ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న సమస్యకు పరిష్కారం లభిస్తోందని అంటున్నారు. ఈ పనులు తొందరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను కోరుతున్నారు.



పార్వతీనగర్ వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న నివాసాలను తొలగించిన స్థలం

రూ.2.75 కోట్లతో బ్రిడ్జి పనులు

చినగదిలిలో నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు వెళ్లే రహదారి ఇరుకుగా ఉండేది. ఈ రహదారిని సూర్యతేజానగర్ గెడ్డ వరకు విస్తరించి డబుల్ రోడ్డు నిర్మించాం. ఇంకా పార్వతీనగర్ నుంచి అంబేడ్కర్‌నగర్ వరకు రోడ్డు విస్తరించనున్నాం. దీని కోసం రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న నివాసాలు తొలగించాల్సి ఉంది. ప్రస్తుతం జీవీఎంసీ నిధులు రూ.2.75 కోట్లతో సూర్యతేజానగర్, పార్వతీనగర్ మధ్యలో ఉన్న గెడ్డపై బ్రిడ్జిని రెండు పక్కలా విస్తరించే పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం 20 అడుగుల వెడల్పు ఉన్న ఈ బ్రిడ్జి సుమారు 40 అడుగులకు విస్తరణ జరగనుంది. దీని సమీపంలో తొలగించిన నివాసాలు స్థానంలో బ్రిడ్జి నిర్మాణం జరిగిన వెంటనే రోడ్డు నిర్మించి వినియోగంలోకి తీసుకొస్తాం. అంబేడ్కర్ కూడలి నుంచి అటు ఆరిలోవకాలనీ, ఇటు తోటగరువు వరకు కూడా రోడ్ల విస్తరణకు ప్రణాళిక సిద్ధమైంది.



– గొలగాని హరి వెంకటకుమారి, నగర మేయర్

రోడ్డు విస్తరణకు శంకుస్థాపన

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి జాతీయరహదారిపై హనుమంతవాక కూడలి నుంచి విశాలాక్షినగర్ ప్రాంతం కైలాసగిరి కూడలి వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి స్థానిక కార్పొరేటర్ స్వాతితో కలసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, మేయర్ మాట్లాడుతూ పర్యాటక ప్రాంతమైన కైలాసగిరి, తెన్నేటి పార్కుకు వెళ్లే ఇరుకు రహదారిని విస్తరిస్తున్నట్టు తెలిపారు. దీని కోసం జీవీఎంసీ అధికారులు సుమారు రూ.4 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఈ నిధులతో రోడ్డును ఇరుపక్కలా విస్తరించి పాత్‌వేలు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ పనులు తొందరగా జరిపించాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అందుకే ఇక్కడ ఎన్నో ఏళ్లగా జరగని పనులను సైతం ఇప్పుడు చేపడుతున్నట్టు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసి నిర్మాణం చేపట్టకుండా వదిలేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోన్–2 జెడ్సీ కనక మహలక్ష్మి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు మోహన్ రెడ్డి, కళావతి, అప్పారావు, శ్రీను, స్థానిక పెద్దలు సత్తి నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ, మేయర్ హరి వెంకటకుమారి

క్లుప్తంగా

12వ వార్డులో కొత్త పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందజేస్తున్న కార్పొరేటర్ రోహిణి, సచివాలయ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో పరిధిలో కొత్తగా 20 మందికి మంజూరైన పింఛన్లను సోమవారం వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి సచివాలయం సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, పి.వి. బాలరాజు, హుస్సేన్, వాసు, సూర్యారావు, మోహన్, రత్నం, సుజాత పాల్గొన్నారు.

శేషుబాబుకు బీసీ నాయకుల అభినందనలు



శేషుబాబును సత్కరిస్తున్న నాయకులు

ఎంవీపీ కాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన మేకా శేషుబాబుకు రాష్ట్ర బీసీ సంఘం నాయకులు, ఏయూ పూర్వవిద్యార్థులు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయనను తిరుమలలో కలిసి సత్కరించినట్టు బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీలకు అన్ని రంగాల్లోనూ సముచితస్థానం కల్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేకా శేషుబాబును టీటీడీ పాలకమండలి సభ్యుడిగా నియమించడం హర్షణీయమన్నారు. గతంలో పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ రాజమండ్రి రూరల్ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్‌గా సేవలందిస్తున్న బీసీ నాయకుడైన శేషుబాబుకు సముచిత స్థానం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మరిన్ని కీలక పదవులు కల్పించాలని ఆకాంక్షించారు.

ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఎం ధర్నా

ఆరిలోవ: కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరకులపై పెంచుతున్న ధరల వల్ల ప్రజలపై ఆర్థిక భారం పడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి. కుమార్ తెలిపారు. సీపీఎం ఆరిలోవ జోన్ ఆధ్వర్యంలో సోమవారం రూరల్ తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారు ఎస్.రమణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ పెంచిన ధరలను తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్యనారాయణ, అప్పలరాజు, కొండమ్మ, నాగరాజు, గౌరీ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సకాలంలో ఓటర్ల సర్వే పూర్తి చేయాలి

కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ: ఇంటింటి ఓటర్ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బీఎల్‌వోలను ఆదేశించారు. జీవీఎంసీ పదో వార్డులో 67, 68 పోలింగ్ కేంద్రాలను జేసీ కె.ఎస్. విశ్వనాథన్‌తో కలసి ఆయన సోమవారం సందర్శించారు. ఆయా కేంద్రాల పరిధిలో జరుగుతున్న ఇంటింటి ఓటరు సర్వేను ఆయన పరిశీలించారు. ఓటర్లతో నేరుగా మాట్లాడి ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. సర్వే జరుపుతున్న బీఎల్‌వోలకు సహకరించాలని కోరారు. అనంతరం ఆయన బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటర్ల నుంచి సేకరించిన వివరాలను పూర్తి సమాచారంతో రిజిస్ట్రేషన్ ద్వారా రికార్డుల్లో నమోదు చేయాలని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీ మోహన్‌రావు, రూరల్ తహసీల్దారు ఎస్.రమణయ్య పాల్గొన్నారు.



ఓటర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

త్వరితగతిన పార్కుల ఆధునికీకరణ

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: నగరంలో చేపడతున్న పార్కుల ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం జోన్–3 పరిధిలో శివాజీ పార్కు తదితర పార్కుల ఆధునికీకరణ పనులు పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శివాజీ పార్కులో చేపడుతున్న ఆధునికీకరణ పనుల్లో వాటర్ ఫౌంటైన్, పెయింటింగ్, లైటింగ్, పచ్చదనం పెంపొందించడం, సందర్శకులు కూర్చునే బల్లల ఏర్పాటు, తాగునీరు, మరుగుదొడ్లు, క్యాంటీన్ వంటి పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పార్కులో పారిశుద్ధ్యం సరిగ్గా నిర్వహించడం లేదని, తాగునీరు, వాకింగ్ ట్రాక్ సరిగ్గా లేవని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కమిషనర్ దృష్టికి తీసుకురాగా, ఆధునికీకరణ పనులు చేపడతున్నామని, పూర్తయిన వెంటనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని బదులిచ్చారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజినీరు శ్యాంసన్ రాజు, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాసరావు, డీఈ, ఏఈ సంబంధిత కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



శివాజీపార్కులో ఫౌంటైన్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్

కనకమహాలక్ష్మికి వెండి పూజాసామగ్రి బహూకరణ

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి విశాఖ నగరానికి చెందిన ఎ. నాగభూషణరావు వెండి పూజా సామగ్రిని బహూకరించారు. కేజీ 232 గ్రాముల 500 మిల్లీ గ్రాముల ఒక వెండి పళ్లెం, వెండి తీర్థపాత్ర, వెండి ఉద్ధరిణిని ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావుకు అందజేశారు. వీరికి అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం అందజేశారు. పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి నర్సీపట్నానికి చెందిన సుంకర సత్యవతి రూ.లక్షా 116 విరాళం అందజేశారు. ఆలయంలో శాశ్వత అన్నదాన పథకం నిమిత్తం ఈ మొత్తాన్ని నగదు రూపంలో దేవాలయ సిబ్బందికి అందజేశారు. దాతకు అమ్మవారి దర్శనం, వేద ఆశీర్వచనం అనంతరం ప్రసాదం అందజేశారు.



వెండి సామగ్రి బహూకరిస్తున్న నాగభూషణరావు కుటుంబ సభ్యులు

కాలుష్య నియంత్రణకు కృషి

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ మనందరి బాధ్యత అని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదలి క్యాంపు కార్యాలయం నుంచి విద్యుత్ వాహనంలో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో వారిద్దరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు అందరూ సహకరించాలని, సాధ్యమైనంత వరకు ప్రజా రవాణాను, విద్యుత్ వాహనాలను ఉపయోగించాలని కోరారు.



తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్

నమో శివ రుద్రాయ

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. మహిళలు ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు.



ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా అందరూ కష్టపడి పనిచేయాలని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. వైఎస్సార్‌సీపీ 18వ వార్డు నాయకులు లాసన్స్‌బే కాలనీలోని కార్యాలయంలో సోమవారం ఎంవీవీని కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వార్డులో ఉన్న సమస్యలు, అవసరాలను వారి నుంచి ఎంవీవీ తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త బాధ్యతలు తీసుకున్నానన్నారు. విశాఖ పరిపాలన రాజధాని కానున్నందున వచ్చే ఎన్నికల్లో విశాఖలో పార్టీ గెలుపునకు అందరూ కృషి చేయాలని తెలిపారు.

గణేష్ ఉత్సవాలకు పందిరి రాట

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులోని పాత వెంకోజీపాలెంలో గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాలకు సోమవారం భక్తిశ్రద్ధలతో పందిరి రాట వేశారు. శ్రీ గౌరీ జ్ఞానలింగేశ్వరాలయం ప్రధాన అర్చకులు రాంపా రామ్మోహన్ శర్మ యువకుల పేరిట రాట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వినాయక చవితి నుంచి 11 రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

అక్రమ నిర్మాణం తొలగింపు



నిర్మాణాన్ని కూల్చివేస్తున్న అధికారులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో సర్వే నంబర్ 314 ప్రభుత్వ స్థలంలో అనధికారికంగా నిర్మించిన అక్రమ భవనాన్ని తహసీల్దార్ వేణుగోపాల్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సోమవారం సాయంత్రం కూల్చివేశారు. గతంలో రెండుసార్లు నిర్మించినప్పుడు కూల్చివేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని, మరలా హెచ్చరిక బోర్డులు ఉన్నప్పటికీ నిర్మాణం చేపట్టడంతో కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ అక్రమ నిర్మాణంపై స్థానికులు స్పందనలో జేసీ విశ్వనాథంకు ఫిర్యాదు చేశారని, ఆయన ఆదేశాల మేరకు తొలగించినట్లు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. ఇదిలా ఉండగా స్థానిక సొసైటీ కోసం నిర్మించిన సామాజిక భవనమని గ్రామ పెద్దలు తెలిపారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు పెద్దరాజు, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

నైపుణ్యం గల మానవ వనరులతో ఆక్వారంగం అభివృద్ధి

ఏయూక్యాంపస్: నైపుణ్యం గల మానవ వనరుల వల్ల ఆక్వారంగం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ–అవంతి ఆక్వాకల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో 'రొయ్యల పెంపకంలో మెరుగైన యాజమాన్య విధానాలు' అనే అంశంపై నిర్వహిస్తున్న 30 రోజుల నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి సాధిస్తున్న రంగాలలో ఆక్వారంగం ఒకటిగా నిలుస్తూ దేశానికి విదేశీ మారకాన్ని ఆర్జిస్తోందన్నారు. అదే సమయంలో ఈ రంగాన్ని అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, నాణ్యతను నిలుపుకోవడం, విత్తనం నుంచి పెంపకం వరకు, ఆహారం వంటివి ఎంతో జాగ్రత్తలతో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగాధిపతి ఆచార్య పి.జానకీరాం మాట్లాడుతూ ఈకార్యక్రమంలో ప్రత్యక్ష శిక్షణ అందించనున్నట్టు చెప్పారు. ఏయూతో అవంతి ఫౌండేషన్‌చేసుకున్న ఎంవోయూలో భాగంగా ప్రపంచ స్థాయి మౌలిక వసతులను కల్పించి, మంచి శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. ఏయూ–అవంతి ఏఎస్‌డీసీ డైరెక్టర్ డాక్టర్ ఏ.కె రెడ్డి మాట్లాడుతూ అవంతి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి ఇంద్ర కుమార్ ఆలోచనలకు ప్రతిరూపంగా నైపుణ్య శిక్షణ కేంద్రం నిలుస్తుందన్నారు.

ఏయూ–అవంతి ఏఎస్‌డీసీ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కె.ఫణి ప్రకాష్ మాట్లాడుతూ ఈ కేంద్రం నుంచి 16వ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 20 మంది బీఎఫ్ఎస్సీ, ఎంఎస్సీ, బీఎస్సీ విద్యార్హత కలిగిన వారు తమిళనాడు, పశ్చిమబెంగాల్, గుజరాత్, ఏపీ నుంచి శిక్షణకు హాజరవుతున్నట్టు చెప్పారు. 13 రోజులు థియరీ, 17 రోజుల పాటు ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కె.రమేష్ బాబు, డాక్టర్ రామచంద్ర గణేష్, డాక్టర్ డి.సునీల్ కుమార్, సీహెచ్ బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోర్సు మెటీరియల్‌ను రిజిస్ట్రార్ ఆవిష్కరించారు.



కోర్సు మెటీరియల్‌ను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

క్లీన్ సిటీ

కార్మికుల చెత్తశుద్ధి



శుభ్రం చేయకముందు



శుభ్రం చేసిన తరువాత

ఏయూక్యాంపస్: నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య సిబ్బంది నిత్యం శ్రమిస్తున్నారు. నౌకానగర్ నుంచి శివాజీపాలెంకు వెళ్లే మార్గంలో ఏయూ ప్రహరీని అనుకుని స్థానికులు నిత్యం వ్యర్థాలు వేస్తుంటారు. ఇక్కడ డస్ట్‌బిన్ ఉన్నప్పటికీ చుట్టూ భారీగా వ్యర్థాలు పేరుకుపోవడం పరిపాటిగా మారిపోతోంది. అయినప్పటికీ పారిశుద్ధ్య సిబ్బంది క్రమం తప్పకుండా వీటిని శుభ్రం చేస్తున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

19వ రోజుకు శ్రీలక్ష్మీ పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు సోమవారం నాటికి 19వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.